క్లుప్తంగా

పరిహారం అందించాలి

కూసుమంచి: వరద ప్రవాహాల్లో కొట్టుకుపోయి మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నాయకన్‌గూడెంలో వరద ప్రమాదంలో మృతిచెందిన యాఖుబ్ ఇంటిని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వీరితో పాటు సీపీఎం అనుబంధ రైతు కూలీ సంఘం నాయకులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఎకరాకు రూ.50 వేల పంట నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

బకాయిల విడుదలపై హర్షం

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీ కండక్టర్లకు 2013 వేతన సవరణకు సంబంధించిన బాండ్ల బకాయిలను గురువారం యాజమాన్యం చెల్లించడంపై టీజీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ)ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. ఇంకా మెకానిక్‌లు, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్ వైజర్లు, ఆఫీస్ సిబ్బందికి కూడా వినాయక చవితిలోగా డబ్బులు అందించాలని కోరారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వరం గ్రామంలో గురువారం పంటలను వ్యవసాయ శాఖ ఏఈఓ శిరణ్మయి పరిశీలించారు. పత్తి, పెసర, మిరప పైర్లను పరిశీలించి దెబ్బతిన్న పంటన వివరాలను నమోదు చేసుకున్నారు.

అన్నదానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని అన్నం ఆశ్రమంలో గురువారం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఆయన నాయనమ్మ అనసూయమ్మ జయంతి సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, న్యాయవాది స్వామి రమేష్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్‌కు నోటీసులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని వాసవీ భవన్ (ఫంక్షన్ హాల్)అధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్‌కుఎస్సై పి.సంతోష్ గురువారం నోటీసులు జారీ చేశారు. ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమాలకు డీజేలు పెట్టొద్దని, బాణాసంచాలు కాల్చొదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీరువా వితరణ

ఖమ్మం మామిళ్లగూడెం: అవామే ఏహింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన పేద యువతి వివాహానికి బీరువాను వితరణ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తిప్పన్నపల్లి గ్రామానికి చెందిన కూలీ యాఖుబ్ కుమార్తె వివాహనికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఖమ్మంలోని జైన్ మసీదు ఇమాం, ఉలేమా ఏ హింద్ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ హఫీజ్ మొహ్మద్ జవ్వాద్ అహ్మద్ గురువారం కుటుంబసభ్యులకు అందజేశారు.

కూలేందుకు సిద్ధం..!





రాజీవ్‌గృహకల్ప అపార్ట్‌మెంట్లు(ఇన్‌సెట్) శిథిలావస్థకు చేరిన గోడలు

శిథిలావస్థలో 'రాజీవ్ గృహకల్ప'

- క్షణమొక యుగంగా గడుపుతున్న నివాసులు
- ఎప్పుడు కూలుతాయోననే ఆందోళన
- డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని డిమాండ్

ఖమ్మంరూరల్: ఇప్పటికే మూడుసార్లు ఈ నివాస గృహాల్లోకి వరద నీరు వచ్చింది. మళ్లీ ఎప్పుడు, ఏ అర్ధరాత్రి వరద విరుచుకుపడుతుందో తెలియని భయానక పరిస్థితిలో మండలంలోని పోలేపల్లి పరిధిలోని రాజీవ్‌గృహకల్ప వాసులు క్షణమొక యుగంగా గడుపుతున్నారు. ఈ నెల 1న వచ్చిన వరద వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది ఫ్లాట్లలో 748 నివాస గృహాలను నిర్మించి అర్హులైన పేదలకు పంపిణీ చేసింది. అప్పటి నుండి పలు రంగాలకు చెందిన కార్మికులు, కూలీలు, ఆటో డ్రైవర్లు కుటుంబాలతో నివాసముంటున్నారు. అయితే గత ఎనిమిదేళ్లలో మూడుసార్లు వరద రాగా మొన్నటి వచ్చిన వరద వారిని కోలుకోలేని దెబ్బ తీసింది. గ్రౌండ్‌ఫ్లోర్ దాటుకుని రెండో ఫ్లోర్ వరకు రావడంతో ఇంట్లోని సామగ్రి మొత్తం కొట్టుకుపోయాయి.

శిథిలావస్థలో గృహాలు..

గత 20 ఏళ్ల క్రితం నిర్మించిన రాజీవ్ గృహకల్పలోని అపార్ట్‌మెంట్ల గృహాలు దాదాపు శిథిలావస్థకు చేరగా.. నేటికి ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఎప్పుడు కూలుతాయోననే నివాసులు ఆందోళన చెందుతున్నారు. మరీ మొన్నటి వరద రెండు ఫ్లోర్ల వరకు రావడంతో గోడలు పెచ్చులూడి దర్శన మిస్తున్నాయి. కేవలం పిల్లర్ల మీదే అపార్ట్‌మెంట్లు నిలబడగా.. గోడలు నెర్రెలు బాచి, స్లాబ్‌ల నుంచి ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. మొన్నటి వరదకు గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణాలు మొత్తం కూలిపోయాయి.

నివాస పాట్లు..

గత 20 ఏళ్ల క్రితం నిర్మించిన గృహకల్ప నిర్మాణాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక తాము ఇక్కడ నివాసముండలేమని, తమను ప్రభుత్వం వేరే చోటుకు తరలించి.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని కోరుతున్నారు. లేదంటే ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రాజీవ్ స్వగృహాలో ఇళ్లు కేటాయించాలంటున్నారు.

రక్షణ గోడ లేక అధిక నష్టం..

రాజీవ్ గృహకల్ప నివాసాలు మున్నేటికి కొద్ది దూరంలోనే ఉండడం, ఏటి పక్కన ఎలాంటి రక్షణ గోడ లేకపోవడంతో ఈసారి వరదతాకిడికి అధిక నష్టం వాటిల్లింది. గతంలో వచ్చిన వరదలు కేవలం నివాస గృహాలకు కొద్ది దూరం వరకే వచ్చి ఆగిపోయింది కానీ ఈసారి వరద బీభత్సం సృష్టించిందని, అదే రక్షణ గోడ ఉంటే ఇంతటి నష్టం జరిగేది కాదని నివాసులు వాపోతున్నారు. వరద ప్రవాహం ఉదయం వచ్చింది కాబట్టి అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణనష్టం లేకుండా బయటపడ్డారు. అదే రాత్రి సమయాన అయితే పరిస్థితి మరోలా ఉండేదని కాలనీవాసులు కన్నీటి పర్యాంతమవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రక్షణ గోడలు నిర్మించాలని నివాసులు కోరుతున్నారు.

ఉండాలంటే భయంగా ఉంది..



శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. ఎప్పుడు కూలుతాయో తెలియక క్షణమొక యుగంగా గడుపుతున్నాం. అపార్ట్‌మెంట్లలోని ఇళ్లన్నీ నెర్రెలు బారాయి. వర్షాకాలం వచ్చిందంటే కంటిమీద కునుకు లేకుండా వరద భయానికి వణికిపోతున్నాం.

– వందెపు సుజాత, రాజీవ్‌గృహకల్ప నివాసి

'డబుల్' ఇళ్లు నిర్మించాలి..



ఇక్కడ గత 20 ఏళ్లుగా ఉంటున్నాం. కానీ గత రెండేళ్లుగా మా ఇళ్లు నెర్రెలు బాచి కూలిపోయే స్థితిలో ఉంది. పాలకులు మారినా ఏ ప్రభుత్వం కూడా శిథిలావస్థలో ఉన్న రాజీవ్‌గృహకల్ప ఇళ్ల గురించి పట్టించుకోవడంలేదు. ఈ ప్రభుత్వమైనా మాకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

– ఏనూటి పద్మ, రాజీవ్‌గృహకల్ప నివాసి

రాజీవ్ స్వగృహాలో ఇళ్లు ఇవ్వాలి..



ఇప్పుదున్న పరిస్థితుల్లో ఇక్కడ ఉండడం ప్రాణాలకు తెగించడమే అవుతుంది. రోజంతా కూలీ పనులు చేస్తేనే పూట గడిచేది. కానీ ఇప్పుడు నూతన ఇళ్లు కట్టుకునే పరిస్థితి లేదు. కాబట్టి ఇక్కడి నుంచి మమ్మల్ని తరలించి రాజీవ్‌స్వగృహాలో ఇళ్లు ఇవ్వాలి.

– పి. నవీన్‌కుమార్, రాజీవ్‌గృహకల్ప నివాసి

బురద బతుకులు..

- తేరుకోని దానవాయిగూడెం, రామన్నపేట ప్రాంతాలు
- వందలాది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు
- ప్రభుత్వం, దాతల వితరణలే దిక్కు



బ్లీచింగ్ చల్లుతున్న కార్మికులు



ప్రభుత్వ కిట్లను అందిస్తున్న ప్రత్యేక అధికారులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని మున్నేరు పరీవాహక ప్రాంతాలైన దానవాయిగూడెం, దానవాయిగూడెం కాలనీ, రామన్నపేట, రామన్నపేట కాలనీలను ఊహకందని రీతిలో వరద ముంచెత్తింది. వరద అయితే అధికారులు ముందస్తు సమాచారం ఇస్తారు కదా అనుకున్న తమను చూస్తుండగానే వాకిలి దాటి గదుల్లోకి చేరాయని బాధితులు చెబుతున్నారు. ఇలా ఒక్క రామన్నపేట, కాలనీలోనే 770 నివాసాలు సర్వం కోల్పోయినట్లు అధికారికంగా గుర్తించారు. దానవాయిగూడెం, కాలనీలో కూడా ఇదే స్థాయిలో నష్టపోయారు. గతంలో ఈ రెండు కాలనీలకు ప్రభుత్వమే పట్టాలిస్తే ఇళ్లు కట్టుకున్నామని, అప్పుడే ఆలోచించి ఉంటే ఇంతటి ఘోరం జరిగిదే కాదంటున్నారు. అంతా చేతి వృత్తులపై ఆధార పడి జీవనం సాగించే వారమని, గత నాలుగురోజులుగా ఇళ్లను శుభ్రం చేసుకుంటూ బురదలోనే బతుకుతున్నామని వాపోతున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు..

రెండు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 600 నుంచి 700 మంది పారిశుద్ధ్య కార్మికులు, జేసీబీల ద్వారా వీధుల్లో పేరుకుపోయిన చెత్తను, నీటి నిల్వలను తొలగిస్తూ, బ్లీచింగ్, క్లోరినేషన్ చేస్తున్నారు.

వితరణలే దిక్కు..

వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందించిన బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు పాలు, కూరగాయాలు, దుప్పట్లను ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పంపిణీ చేస్తున్నారు. మరోవైపు దాతలు ఉదయం, సాయంత్రం అన్నదానం, పండ్లు, దుస్తులు అందిస్తున్నారు.

సర్వ నాశనం..



వాటర్ ట్యాంక్ వద్ద గుడారంతో నర్సమ్మ

ఈ ఫొటోలో కనిపిస్తున్న జానపాటి నర్సమ్మ రామన్నపేట కాలనీలో గంగిరెద్దులతో జీవనం సాగించే సంచార జాతికి చెందింది. అయితే వరద తాకిడికి తాము తాత్కాలికంగా వేసుకున్న గుడారంతో పాటు సామగ్రి, గంగిరెద్దుల కోసం సేకరించిన గడ్డి మొత్తం తుడుచుపెట్టుకుపోయింది. ఆమె భర్త మంచానికి పరిమితం కాగా, కుమారుడు చెట్టుపై నుంచి పడి అనారోగ్యంతో ఉన్న తరుణంలో ఇలా జరిగిందని ఆమె రోదిస్తోంది. ప్రస్తుతం ప్రధాన రోడ్డులోని వాటర్ ట్యాంక్ పక్కన ఉన్నామని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటోంది.

నిమిషాల్లోనే ముంచింది..



నిమిషాల్లోనే మా ఇళ్లను వరద నీరు ముంచింది. ఏం జరుగుతుందని తెలుసుకునేలోపే ఇంటి శ్లాబు లెవల్ వరకు వరద చేరి సామగ్రిని తీసుకుపోయింది. రెక్కల కష్టంతో జీవనం సాగించే మాకు ఎవరు ఎంత సాయం చేసినా జరిగిన నష్టం పూడ్చలేనిది. ఇళ్లు, సామగ్రిని చూస్తుంటే దుఃఖం ఆగడం లేదు.

– మహమ్మద్ అబ్దుల్‌ఫరీద్, దానవాయిగూడెం

ఇంకా కోలుకోలే..

ఛిద్రమైన వైకుంఠధామం..



నాశనమైన ప్రకాశ్‌నగర్ వైకుంఠధామం

ఈ చిత్రంలో కనిపిస్తున్నది ప్రకాశ్‌నగర్ మున్నేరు ఒడ్డున ఉన్న వైకుంఠధామం. గత ప్రభుత్వం దీన్ని రూ.లక్షలు వెచ్చించి కట్టించింది. అయితే మున్నేరు వరద ఉధృతితో శ్మశాన వాటిక నామరూపాల్లేకుండా పోయింది.

- పునరావాస కేంద్రాల్లోనే భోజనాలు
- వరద సాయం కోసం ఎదురుచూపులు
- ఇళ్లను శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నం



ప్రకాశ్‌నగర్ పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న బాధితులు



బట్టలు పిండుకుంటున్న పెద్దమ్మగుడి ప్రాంత బాధితులు

ఖమ్మంవైద్యవిభాగం, ఖమ్మంస్పోర్ట్స్: మున్నేరు వరద కనీవినీ ఎరుగని రీతిలో నష్టాన్ని తీసుకొచ్చింది. దీంతో బాధితులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ముఖ్యంగా ప్రకాశ్‌నగర్, పంపింగ్‌వెల్‌రోడ్‌లోని పెద్దమ్మగుడి ప్రాంత బాధితుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వరద వచ్చిపోయి మూడు రోజులు దాటినా ఏమాత్రం కోలుకోలేదు. ఇళ్లలోని బురదమేటలు, చెత్తాచెదారం తొలగించడమే సరిపోతుంది. ఇంట్లో సామన్లు, వంట సామగ్రి వరదలో కొట్టుకుపోవడంతో పునరావస కేంద్రాలు, దాతలు పంపిణీ చేసే అన్నం పొట్లాలు తింటూ పూట గడుపుకుంటున్నారు. కొందరు ఇళ్లు పూర్తిగా కోల్పోగా, మరికొందరు అక్కడ ఉండలేక ఉన్న సామన్లతో వేరే ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.

నాశనమైన బ్రిక్స్ పరిశ్రమ..



పూర్తిగా కొట్టుకుపోయిన బ్రిక్స్ పరిశ్రమ

ఈ చిత్రంలో కనిపిస్తున్నది ప్రకాశ్‌నగర్ ఓవర్ బ్రిడ్జి దగ్గరలోని బ్రిక్స్ పరిశ్రమ. ఇక్కడ సిమెంట్ ఇటుకలు, వరలు, ఇతర సామగ్రి తయారు చేస్తుండడంతో పలువురి కార్మికులకు ఉపాధి లభించేది. కానీ ఇప్పుడు వరద తాకిడికి మొత్తం తుడుచుపెట్టుకుపోయింది.

వరద బాధితులకు ఆపన్నహస్తం



ఖమ్మంగాంధీచౌక్: భోజన ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను అందిస్తున్న కరూర్ వైశ్య బ్యాంక్ బృందం



బాధితులకు నిత్యావసరాలను అందజేస్తున్న భద్రాద్రి బ్యాంక్ బృందం



ప్రకాష్‌నగర్‌లో ఆహారం, బియ్యం తదితరాలను అందిస్తున్న కోమట్లగూడెం వాసులు

- **ఖమ్మం మామిళ్లగూడెం:** మున్నేరు వరద ముంపునకు గురైన మంచికంటినగర్, బొక్కలగడ్డ, సారథినగర్‌లో బాధితులకు ఖమ్మం ఫ్రూట్స్ మర్చంట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పండ్లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం అందజేశారు. అలాగే జలగంనగర్‌లో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యాన దుప్పట్లు పంపిణీ చేశారు. అంతేకాక బీజేపీ నేత తాండ్ర వినోద్ రావు ఆధ్వర్యాన జలగంనగర్, పెద్దతండావాసులకు దుస్తులు అందించారు.
- **ఖమ్మంగాంధీచౌక్:** నగరంలోని ప్రకాష్‌నగర్ బాధితులకు కోమట్లగూడెం గ్రామానికి చెందిన పలువురు ఆహారం, బియ్యం, దుస్తులు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. అలాగే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) ఆధ్వర్యాన బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంతేకాక కరూర్ వైశ్యా బ్యాంక్ ఆధ్వర్యాన మంచికంటినగర్, బొక్కలగడ్డ ప్రాంతాల్లో ఆహారం, బిస్కెట్లు, తాగునీరు అందించారు. అదేవిధంగా భద్రాద్రి కో–ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యాన మంచికంటినగర్, బొక్కలగడ్డ తదితర ప్రాంతాల్లో నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అలాగే త్రిదండి చినజీయర్ స్వామి గురువారం పలువురు బాధితులకు రగ్గులు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా వికాస తరంగిణి అందించిన వాటర్ బాటిళ్లు, పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. అలాగే గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన వికలాంగుల కాలనీలో నిత్యావసరాలను అందించారు. అంతేకాక ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్మికుల కుటుంబాలకు ఐఎన్‌టీయూసీ నాయకుడు నున్నా మాధవరావు ఆధ్వర్యాన జీవీమాల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు సహకారంతో బట్టల పంపిణీ చేశారు. అదేవిధంగా ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన పంపింగ్‌వెల్ రోడ్, మోతీనగర్, బొక్కలగడ్డ ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు.
- **ఖమ్మంమయూరిసెంటర్:** ధంసలాపురం కాలనీలో నిరాశ్రయులైన వారికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు అతడి సోదరుడు, వారి స్నేహితులు సహకారంతో ఏర్పాటు చేసిన 200 దుప్పట్లను సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పంపిణీ చేశారు. అలాగే ఖమ్మం ఫొటోగ్రఫీ యూనియన్ నాయకులు దాతల నుంచి సేకరించిన రూ.10లక్షల విరాళాల నుంచి 26 మంది వరద బాధితుల ఫొటోగ్రాఫర్ కుటుంబాలకు రూ.35వేలు, రూ.3వేల సరుకుల చొప్పున అందించారు.
- **ఖమ్మం సహకారనగర్:** పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తరఫున బ్లాంకెట్లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు గురువారం అందించారు. అలాగే ఎస్‌బీఐటీ కళాశాల ఆధ్వర్యాన బాధితులకు అన్నదానం నిర్వహించారు.
- **ఖమ్మంఅర్బన్:** నగరంలోని రామన్నపేట కాలనీలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన దుస్తులు అందజేశారు.
- **నేలకొండపల్లి:** మండలంలోని రామచంద్రాపురం, సుర్దేపల్లి, కట్టుకాచారం గ్రామాల్లో వరద బాధితుల ఇళ్లను గురువారం అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. సుర్దేపల్లిలో 113 ఇళ్లకు గాను 310 మంది, రామచంద్రాపురంలో 80 ఇళ్లకు గాను 320 మంది, కట్టుకాచారంలో 7 ఇళ్లకు గాను 30 మంది నివస్తున్నారని గుర్తించి ప్రభుత్వం అందించిన నిత్యావసర సరుకులను బాధితులకు అందించారు.
- **తిరుమలాయపాలెం:** మండలంలోని రాకాసితండా బాధితులకు సయ్యద్ మదార్ సాబ్ చారిటబుల్ ట్రస్ట్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్‌ల ఆధ్వర్యాన గురువారం దుప్పట్లు, లుంగీలు, నైటీలు, టవళ్లతో కూడిన కిట్లను పంపిణీ చేశారు.
- **ఖమ్మంరూరల్:** మండలంలోని జలగంనగర్, రాజీవ్‌గృహకల్పలోని బాధితులకు ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన అన్నదానం చేశారు.
- **కూసుమంచి:** మండలంలోని తుమ్మలతండా వరద బాధితులకు గ్రామంలో బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.



తెరుచుకోని జలగంనగర్ రామాలయం



మజీద్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం



బురదతో అస్తవ్యస్తంగా ఉన్న నాయుడుపేట చర్చి

వరదకు ఏదీ అడ్డుకాదు..

మున్నేరు వరద నగరంలోని జలగంనగర్‌లో గల మందిరాలు, మసీద్‌లు, చర్చిలకు సైతం వదలకుండా బురదతో నింపింది. దీంతో రామమందిరంలో పూజలు నిలిచిపోగా, మసీద్ ఈ క్యూబాలో నేడు శుక్రవారం కావడంతో ఫయామ్ముద్దీన్ మౌల్సాబ్ ఆధ్వర్యంలో శుభ్రం చేస్తున్నారు. అలాగే నాయుడుపేట చర్చిని ఆదివారంలోపు శుభ్రం చేసి ఆరాధనలకు అందుబాటులోకి తేనున్నట్లు చర్చి ఫాదర్ తెలిపారు.

– ఖమ్మంవన్‌టౌన్

పలువురికి నివాళి

- **రఘునాథపాలెం:** మండలంలోని వీవీపాలెంకు చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు కుతుంబాక బసవ నారాయణ బుధవారం మృతి చెందగా.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డి నివాళులర్పించారు. నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నల్లమల్ల వెంకటేశ్వరావు, యరగర్ల హనుమంతరావు, కుతుంబాక సీతారాం, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కూరపాటి వెంకటేశ్వర్లు, కృష్ణప్రసాద్, తదితరులు ఉన్నారు.
- **ఖమ్మంఅర్బన్:** నగరంలోని 59వ డివిజన్ దానవాయిగూడెంకు చెందిన నాగటి లక్ష్మయ్య గురువారం మృతి చెందగా.. డివిజన్ నాయకుడు దామాల రవి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబాన్ని రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. నల్లూరి మధుబాబు, అనబత్తుల వెంకటేశ్వర్లు, మద్దెల ఉపేందర్, నాగటి భిక్షం, బత్తుల రవి, కరుణాకర్, తదితరులు ఉన్నారు.
- **కామేపల్లి:** మండలంలోని పండితాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అంబటిపూడి రంగయ్య(84) గురువారం అనారోగ్యంతో మృతి చెందగా.. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నున్నా నాగేశ్వరరావు, పోతినేని సుదర్శన్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, వై.విక్రమ్, నరేందర్, మనోహర్, నరసింహారెడ్డి, హన్మంతరావు, మల్లిబాబుయాదవ్, తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితా రూపకల్పన



ఓటర్ల జాబితా తయారీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నేలకొండపల్లి: మండలంలోని గ్రామ పంచాయతీలలో ఓటర్ల జాబితా రూపకల్పనలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఈక్రమంలో మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ప్రక్రియను గురువారం ఎంపీడీఓ ఎం.యర్రయ్య పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, నేలకొండపలి మేజర్ పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలు కిటకిట



సిబ్బందితో హడావుడిగా ఉన్న బొక్కలగడ్డ ప్రాంతం

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేటి వరదలు తగ్గుముఖం పట్టడంతో బాధితులు వారి ఇళ్లకు చేరుకుని ఇళ్లు, సామన్లను శుభ్రం చేసుకుంటుండగా. పలువురు పరామర్శించడం, కేఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది చెత్త, బురదను తొలగిస్తుండడంతో ముంపు ప్రాంతాలు జనాలతో కిటకిట లాడుతున్నాయి. అంతేకాక బాధితుల బంధువులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, నష్టం అంచనా వేసే సర్వే బృందాలు, వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతుండడంతో పాటు పోలీస్‌శాఖ, ఇతర ప్రభుత్వ శాఖలన్నీ ఈ కాలనీల్లోనే ఉంటూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తుండడంతో కాలనీలన్నీ రద్దీగా మారాయి.

వరద బాధితులకు పొంగులేటి ట్రస్ట్ సాయం



కిట్లను పరిశీలిస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: పాలేరు నియోజకవర్గ ముంపు బాధితులకు ప్రభుత్వసాయంతో పాటు పొంగులేటి స్వరాజ్యం–రాఘవరెడ్డి ట్రస్ట్ తరఫున సాయం చేయనున్నట్లు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే గత నాలుగు రోజులుగా బాధితులకు అన్నపానీయాలను అందిస్తుండగా.. నేటి నుంచి 10 రోజులకు సరిపడా నిత్యావరసాలు ఇచ్చేందుకు ప్యాకింగ్ ప్రక్రియ పూర్తిచేస్తున్నామన్నారు. వీటితో పాటు చీరలు, లుంగీలు, టీషర్టులు, కండువాలు, బెడ్ షీట్లను పంపిణీ చేయనుండగా.. మంత్రి సోదరుడు ప్రసాదరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు దయాకర్‌రెడ్డి తెలిపారు.

గుంతలు పూడ్చివేత

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు సమీపంలో తెగిపోయిన రహదారిపై హెచ్చరిక బోర్డులు లేక గుంతలో పడి ఓ యువకుడు మరణించాడు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి గురువారం కొక్కిరేణి ఎర్రగడ్డ గ్రామాల మధ్య ఏర్పడిన గుంతను మాజీ జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ ఆధ్వర్యాన మట్టి తరలించి పూడ్చారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: కుటుంబ కలహాల నేపథ్యాన మండలంలోని పైనంపల్లికి చెందిన షేక్ షమీనా(29) గురువారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు 108లో నేలకొండపల్లి సీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కోదాడ సీహెచ్‌సీకి తరలించారు.

ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు



టీడీపీ కార్యాలయంలో ఉపాధ్యాయులకు సన్మానం



వాకర్స్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పలు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీఓల ఆధ్వర్యాన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, రిటైర్డ్ విద్యాధికారులను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థుల భవితకు బాటలు వేసిన, వేస్తున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.

– ఖమ్మంఅర్బన్